క్లుప్తంగా

బీఎల్‌ఏలతో సమావేశం


బూత్ కమిటీల సభ్యులకు సూచనలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 25వ వార్డుకు సంబంధించిన బూత్ లెవల్ ఏజెంట్లతో శనివారం ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌ఏలకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, డైరెక్టర్ నూకరాజు, సీనియర్ నాయకులు, బూత్ కన్వీనర్లు, కర్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా సునీల్‌కుమార్



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎం.సునీల్ కుమార్‌ను నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఘనంగా పాలు గొలుపు ఉత్సవం


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు మర్రిపాలెం వరాహ లక్ష్మీనరసింహ స్వామికి నంబారు పైడిరాజు యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా పాలు గొలుపు ఉత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చేపట్టిన భారీ అన్నసమారాధనను ఆయన ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చల్లా రజని, పార్టీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, నాయకులు కాయిత పైడిరత్నాకర్ యాదవ్, కణితి చిరంజీవి, జ్ఞానేశ్, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, నమ్మి శంకర్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన నిర్వహించారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పూజా కార్యక్రమాల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో 132 కేవీ హెచ్‌టీ టవర్ ఏర్పాటు, కండక్టర్ మార్పుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.


నక్కవానిపాలెంలో ఆధునికీకరించిన ఇందిరాగాంధీ పార్కు

దశ తిరిగింది

- 24వ వార్డులో ప్రగతి పరుగులు
- రూ.20.90 కోట్లతో అభివృద్ధి పనులు


క్రాంతినగర్‌లో శెట్టిబలిజల కోసం నిర్మించిన భవనం


నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేసిన నక్కవానిపాలెం జీవీఎంసీ స్కూల్

సీతమ్మధార: విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ప్రాంతం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతోంది. ఈక్రమంలో జీవీఎంసీ జోన్-3 పరిధిలోని 24వ వార్డు దశ తిరిగి ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. ఈ వార్డులో సుమారు రూ.20.90 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. అందమైన రోడ్లు, సచివాలయ, సామాజిక భవనాలు, కాలువలు, డ్రెయిన్లు, ఫుట్‌పాత్‌లు నిర్మించారు. పచ్చని పార్కులను ఆధునికీకరించి, విద్యుద్దీపాలు ఏర్పాటు చేసి వార్డును మరింత సుందరంగా మార్చారు. గత ప్రభుత్వంలో ఇక్కడి రోడ్డు అధ్వానంగా ఉండేవి. వాటిని నేడు అభివృద్ధి చేయడంతో అద్దంలా మెరుస్తున్నాయి.

ఏళ్ల నాటి సమస్యలకు పరిష్కారం

వార్డులోని ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి.. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సహకారంతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నక్కవానిపాలెంలో ఎప్పటి నుంచో వేధిస్తున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. స్థానికులకు ఉపయోగపడేలా రేసపువానిపాలెంలో మూడంతస్తుల సామాజిక భవనం, క్రాంతినగర్‌లో శెట్టిబలిజ భవనం నిర్మించారు. బృందావన్, ఇందిరా గాంధీ పార్కులను ఆధునికీకరించారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేశారు. తాగునీటి పైపుల్లో మురుగు నీరు కలవకుండా చర్యలు చేపట్టారు. వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, ఫుట్‌పాత్ నిర్మాణ పనులను పూర్తి చేశారు. సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి విగ్రహం కూడలి వరకు 80 అడుగులుగా రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సీతమ్మధార రైతుబజార్ వద్ద జరుగుతున్న రహదారి విస్తరణ పనులు

అభివృద్ధి పనులు.. వెచ్చించిన నిధులు

- రూ.65 లక్షలతో రేసపువానిపాలెంలో మూడంతస్తుల సామాజిక భవనం నిర్మించారు.
- రూ.2.5 కోట్లతో రేసపువానిపాలెం భూలోకమాత గుడి ప్రాంతంలో రోడ్లు, కాలువలు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేశారు.
- రూ.23 లక్షలతో ఇందిరాగాంధీ పార్కు, బృందవన్ పార్కులను ఆధునికీకరించారు.
- రూ.40 లక్షలతో నక్కవానిపాలెంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు.
- రూ.77 లక్షలతో నాడు-నేడు కింద నక్కవానిపాలెం జీవీఎంసీ పాఠశాలను అభివృద్ధి చేశారు.
- రూ.8 లక్షలతో క్రాంతినగర్‌లో శెట్టిబలిజ భవనం నిర్మించారు.
- రూ.17 కోట్లతో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

సువిధ యాప్‌లోనే అన్ని అనుమతులు

- 48 గంటల ముందుగానే తీసుకోవాలి
- 'ఉత్తర' రిటర్నింగ్ అధికారి అఖల



సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సువిధ యాప్‌లోనే అన్ని అనుమతులు తీసుకోవాలని, 48 గంటల ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.అఖిల స్పష్టం చేశారు. డిజిటల్ ప్రచార రథాలకు జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. శనివారం 'సాక్షి'తో ఆమె మాట్లాడుతూ సమావేశాలు, లౌడ్ స్పీకర్స్, తాత్కాలిక పార్టీ కార్యాలయాలు, కరపత్రాలు, వాహనాలు, వీధిలో సమావేశాలకు నియోజకవర్గ ఎన్నికల అధికారి అనుమతులు ఇస్తారని తెలిపారు. ఇతర జిల్లాలకు సంబంధించిన వాహనాలకు పర్మిషన్ ఉండాలన్నారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీలు, అభ్యర్థి వాహనాలతో పాటు లౌడ్ స్పీకర్లు, బ్యానర్, పార్టీ జెండాలు, హోర్డింగ్‌ల ఏర్పాటుకు 48 గంటల ముందుగానే పర్మిషన్ తీసుకోవాలని, అప్పటికప్పుడు అనుమతులు ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. ఎటువంటి అనుమతి లేనప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అఖిల పేర్కొన్నారు.

సుందర అభయాంజనేయ ఆలయంలో కె.కె.రాజు పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కె.కె.రాజు, చొక్కాకుల వెంకటరావు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో 45వ వార్డు సోషల్ మీడియా ఇన్‌చార్జి మాత ఈశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వారి వెంట పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరి పట్నాయక్, గణపతి, శ్యామ్, అప్పలరాజు, అనంత్, శెట్టి, రెడ్డి తదితరులు ఉన్నారు.

పార్వతీశ్వరాలయంలో శనీశ్వరుడికి పూజలు


శనీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు


నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

సీతంపేట: శని త్రయోదశి సందర్భంగా సీతంపేట పార్వతీశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం తెల్లవారుజామున భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించి శనీశ్వరుడికి తైలాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ శాస్త్రోక్తంగా భక్తుల చేత శనీశ్వరుడికి పూజలు చేయించి, దూప, దీప హారతులిచ్చారు.

25న అయ్యప్ప జన్మదిన మహోత్సవం

శ్రీబాలమురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 25న పార్వతీశ్వరాలయంలో అయ్యప్పస్వామి జన్మదిన మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు భాస్కరశర్మ తెలిపారు. తెల్లవారుజామున 4 గంటలకు అయ్యప్పస్వామికి పంచామృత, గంధ, విభూది, పండ్లరస, సుగంధ జలాలతో విశేష అభిషేకం జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు సీతంపేట వీధుల్లో అంగరంగ వైభవంగా స్వామి వారి ఊరేగింపు ఉంటుందని, భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

నవగ్రహాలకు ప్రత్యేక పూజలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవాలయంలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో శని త్రయోదశి సందర్భంగా నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నువ్వుల నూనెతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపారు.

సెమీస్‌కు వాలీబాల్ టోర్నీ

విశాఖ స్పోర్ట్స్: డీఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నీ మెన్ తొలి సెమీస్‌లో ప్రకాశం జిల్లా జట్టుతో తూర్పుగోదావరి జిల్లా జట్టు తలపడనుండగా... మరో సెమీస్‌లో ఈకోరైల్వే జట్టుతో కృష్ణాజిల్లా జట్టు తలపడనుంది. రైల్వే గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు 26-24,25-18తో సాయ్ యానం జట్టుపైన, తూర్పుగోదావరి జట్టు 25-23, 31-29తో శ్రీకాకుళం జట్టుపైన విజయం సాధించి సెమీస్‌కు అర్హత సాధించాయి. ఈస్ట్‌కోస్ రైల్వే జట్టు 25-18,25-21తో సాట్స్ హైదరాబాద్ జట్టుపైన, కృష్ణాజిల్లా జట్టు 18-25తో తొలి సెట్‌లో వెనుకబడినా 25016,15-11తో తరువాత సెట్స్‌లో కిట్స్‌వర్సిటీ జట్టుపై విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాయి.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులతో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, అతిథులు, ఈకార్వో ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) నేతృత్వంలో నడుస్తున్న అనురాగ్ మాంటిస్సోరి స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం న్యూ రైల్ క్లబ్‌లో ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ అనురాగ్ మాంటిస్సోరి స్కూల్ సుశిక్షితులైన ఉపాధ్యాయ బృందంచే విజయవంతంగా నడుస్తోందని కొనియాడారు. అద్భుతమైన టీచింగ్, అడ్మినిస్ట్రేషన్లను ఆయన అభినందించి.. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. మంజుశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో చక్కటి సదుపాయాలతో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, డే కేర్ సెంటర్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు, ఆడియో విజువల్ క్లాస్‌రూంలు, ఇతర ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. గ్రాడ్యుయేషన్ డే చిన్నారుల్లో ఆనందాన్ని నింపుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యతోపాటు సామాజిక స్పృహ, పాజిటివ్ థింకింగ్, ఒత్తిడిని జయించడం వంటివి నేర్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహు(ఆపరేషన్స్), ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహు, జాయింట్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సంయుక్త, స్కూల్ సిబ్బంది, ఈకార్వో ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్

విశాఖ స్పోర్ట్స్: న్యూకాలనీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ శనివారంతో ముగిసింది. రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌ను వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ప్రారంభించి ఇరుజట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలతోపాటు కిట్లను ఆయన అందించారు.

నైపుణ్యాలపై దృష్టి సారించాలి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో సైకాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో మనస్తత్వ శాస్త్రం-వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న పోకడలపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ముగింపు సదస్సులో ముఖ్య అతిథి ఆంధ్ర విశ్వవిద్యాలయ అకాడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, విశిష్ట అతిథి హైదరాబాద్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్య డి.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సంకల్ప బలం, క్రమశిక్షణ, జ్ఞానం, నైపుణ్యాలు పెంచుకోవాలసూచించారు. సదస్సు కన్వీనర్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.జ్యోతి, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. వారికి అందిన సమాచారం మేరకు కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్స్ వద్ద శనివారం రాత్రి కంచరపాలెం ఎస్‌ఐ రవికుమార్ దాడులు నిర్వహించారు. అక్కడ ఖాళీ ప్రదేశంలో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,500 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్‌ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కామర్స్ అధ్యాపకులకు శిక్షణ తరగతులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు జిల్లాలకు చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కామర్స్ అధ్యాపకులకు ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ నెల 18 నుంచి 23 వరకు కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్, ఐఐటీ ఢిల్లీ బృందం సభ్యులు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. నూతన అంశాలపై అధ్యాపకులు పట్టు సాధించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు.

'ఉత్తర' అభివృద్ధే ప్రధాన ధ్యేయం


పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- 24వ వార్డు పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం

సీతమ్మధార: నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు తెలిపారు. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి నివాసంలో పార్టీ శ్రేణులతో శనివారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, పనులు త్వరగా పూర్తవుతున్నాయని, తద్వారా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. గత ఎన్నికల్లో తాను పోటీ చేసి ఓడినా.. ప్రజలతోనే ఎల్లప్పుడూ ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నానన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు అంతా సమష్టిగా కృషి చేయాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, వీకేపీసీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, బొచ్చు కృష్ణారెడ్డి, గుడ్ల రాఘురామిరెడ్డి, నక్క ప్రకాష్‌రెడ్డి, నక్క అప్పలరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, లోకేష్‌రెడ్డి, చిన్నా, బోర రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. గెలిపించండి


వాకర్స్‌కు అభివాదం చేస్తున్న కె.కె.రాజు. చిత్రంలో రెయ్యి వెంకటరమణ తదితరులు

మర్రిపాలెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం 51వ వార్డు కళింగనగర్‌లోని ఈస్ట్ పార్కు, ఎంఎస్ఆర్ పార్కులను వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సందర్శించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి అక్కడ పర్యటించారు. పార్కులకు వచ్చిన వాకర్స్, వ్యాయామం చేసేందుకు వచ్చిన యువత, చిన్నారులతో కలిసి కాసేపు సరదాగా గడిపి వారితో కె.కె.రాజు ముచ్చటించారు. సార్వత్రిక ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. ప్రజలందరికీ అండగా ఉంటానన్నారు. వాకర్స్ అంతా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి


అశోక్‌నగర్‌లో కవాతు చేస్తున్న సీఐ రమేష్, సీఐఎస్ఎఫ్ బలగాలు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు ద్వారకా జోన్ సీఐ ఎస్.రమేష్ నేతృత్వంలో ఆశీలమెట్ట నుంచి సివిల్ పోలీసులు, బలగాలు సంయుక్తంగా కవాతు చేపట్టారు. ఆశీలమెట్ట, ద్వారకానగర్, శ్రీనగర్, అశోక్‌నగర్, రెల్లివీధి, హిందూ ముస్లిం కాలనీ, బిలాల్ కాలనీ, టీపీటీ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేశారు. పలు చోట్ల ప్రజలకు ఓటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ నిమిత్తం సీఐఎస్ఎఫ్ కంపెనీలను నగరానికి కేంద్ర ఎన్నికల సంఘం పంపించిందని తెలిపారు. వారితో ప్రధానంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడమే కాకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తామున్నామని ఒక భరోసా కల్పించేందుకు ఈ ఫ్లాగ్‌మార్చ్ చేసినట్లు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని కోరారు. నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అధికారులు, ద్వారకా స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం శ్రేయస్కరం


పౌష్టికాహార పక్షోత్సవంలో పాల్గొన్న సూపర్‌వైజర్ జ్యోతి

మర్రిపాలెం: చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ మర్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జె.టి.ఎస్.జ్యోతి అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పఖ్వాడా నిర్వహించారు. గర్భిణులు వెయ్యి రోజుల సంరక్షణను వివరిస్తూ చిన్నారుల చేత ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్(ఈసీసీఈ) డే నిర్వహించారు. తల్లిదండ్రులకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు పోషకాహార ప్రాముఖ్యాన్ని అంగన్‌వాడీలు వివరించాలని సూచించారు. ప్రతి తల్లి తన బిడ్డలకు పోషక విలువలతో కూడిన ఆహారం పెట్టేలా అవగాహన కల్పించి, పౌష్టికాహారం మేధోశక్తి, చురుకుదనం మీద ఎంతో ప్రభావం చూపిస్తుందని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మాలా బీబీ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో ఇంటికి రక్షణ


శ్రీనివాసనగర్ వాసులకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ఇంటికి రక్షణగా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని తాటిచెట్లపాలెం, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో శనివారం నివాసులకు సీసీ కెమెరాలు, దొంగతనాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు కాల్ చేసి సమాచారమివ్వాలని కోరారు. ఇంట్లో విలువైన బంగారు నగలు, నగదు ఉంచారదని, బ్యాంక్‌లో భద్రపరచడమే మేలని సూచించారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు ఇంటికి జాగ్రత్తగా తాళాలు వేసుకుని, ఇరుగుపొరుగు వారితోపాటు పోలీసులకు తెలియపర్చాలనన్నారు. వాకింగ్ చేసే మహిళలు మెడలో బంగారు నగలు కనిపించకుండా జాగ్రత్త పరుచుకోవాలన్నారు. బ్యాంకు అధికారులు మంటూ ఏటీఎం పిన్ ఎవరైనా అడిగితే చెకూడదని సూచించారు. సైబర్ క్రైం కేసులపై ప్రజలకు వివరించారు. చోరీ కేసుల్లో పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.